# కంపెనీ

**-సి.ఎస్.ఆర్.ప్రసాద్**

చిట్టిబాబు లోపలకు వస్తుంటే అదోరకమైన వాసన హాలంతా వ్యాపించింది. బూట్లు విప్పకుండానే సోఫాలో చతికిలబడ్డాడు. సావిత్రివైపు అదోరకంగా చూసాడు. నవ్వుతుంటే మూతి వంకరగా తిరిగినట్లనిపించింది. అతని కళ్లు ఎర్రగా ఉన్నాయి. క్రాఫ్ చెరిగిపోయి ఉంది.

సావిత్రి తీవ్రంగా చూసింది. అప్పటికి రాత్రి పది దాటింది. సెల్‌కి ఎన్నిసార్లు ఫోన్ చేసినా రెస్పాన్స్ రాలేదు. చార్జింగ్ అయిపోయి వుంటుంది అనుకుంది. ఇప్పటివరకూ ఇంటికి చేరుకోకపోవడంతో ఆందోళన చెందుతూ ఉంది.

"పార్టీకి వెళ్లి వచ్చాలే" అన్నాడు చిట్టిబాబు.

ఆ వాసన ఏమిటో ఇప్పుడు అర్థమయింది సావిత్రికి. కూరగాయలకు వెళ్లినప్పుడు బ్రాందీ షాపు దగ్గర జనం నిలబడి తాగుతుంటారు. ఆ వాసన గుప్పుమంటూ వుంటుంది. సావిత్రి ముక్కు మూసుకుని గబగబా అడుగులు వేస్తూ వుంటుంది ఆ కాస్త దూరం.

జనం అలా పబ్లిగ్గా తాగుతుంటే పోలీసులు ఏం చేస్తుంటారో? అని గొణుక్కునేది సావిత్రి.

ఆ వాసన ఇప్పుడు సరాసరి ఇంట్లోకి వచ్చేసింది. ఏమిటి చేయడం?

"భోజనం వడ్డించనా?" అడిగింది సావిత్రి.

"పార్టీలో డిన్నర్ కూడా కలిపే వుంటుంది" అన్నాడు చిట్టిబాబు.

సావిత్రి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి పడుకుంది.

కాసేపటికి డ్రెస్ మార్చుకుని వచ్చాడు చిట్టిబాబు. సావిత్రి ముక్కు మూసుకుని పడుకుంది. కొంచెంసేపైన తరువాత చిట్టిబాబు ఆమె మీద చేయి వేసాడు.

విసిరికొట్టింది సావిత్రి. అలా రెండుమూడు సార్లు ట్రై చేసాడు.

ఒకసారి ఆమెను తనవైపు బలవంతంగా తిప్పుకున్నాడు.

సావిత్రి లేచి వెళ్లిపోయింది.

చిట్టిబాబుకు నిద్ర పట్టక అటూ ఇటూ దొర్లాడు.

సావిత్రి ఎక్కడికెళ్లింది? అనుకుంటూ హాల్లోకి వెళ్లాడు. సావిత్రి సోఫాలో పడుకుని ఉంది.

"సావిత్రీ! ఇక్కడ పడుకున్నావేంటి?"

"మీ దగ్గర పాడు వాసన. వాంతి వచ్చేట్లుంది. కడుపులో తిప్పుతోంది" అసహ్యంగా అంది.

"నేనేం చేయనులే. రా... వచ్చి పడుకో" చిట్టిబాబు మాటలు ముద్దముద్దగా వస్తున్నాయి.

"మీరు తాగుతారని నాకు పెళ్లికి ముందు తెలీదు. తెలిస్తే చస్తే మిమ్మల్ని చేసుకునేదాన్ని కాదు" అంది సావిత్రి.

"నేనేం తాగుబోతును కాను. అప్పుడప్పుడూ పార్టీల్లో తాగుతాను అంతే."

"ఆ వాసన నాకు పడదు"

"సరే ఇంకెప్పుడూ తాగను" ప్రామిస్ చేసాడు చిట్టిబాబు.

"మీరెళ్లి పడుకోండి. ఇక మాట్లాడకండి. చండాలపు వాసన" అని ముక్కుకి చీరకొంగు అడ్డం పెట్టుకుంది.

చిట్టిబాబుకి వళ్లు మండిపోయింది. బెడ్రూమ్‌లోకి వెళ్లి ధనామని తలుపులు విసిరికొట్టాడు.

***

అయితే చిట్టిబాబు తన ప్రామిస్ నిలుపుకోలేదు. వీకెండ్ పార్టీ అని శనివారం రాత్రి తాగి వచ్చేవాడు.

ఆదివారం ఎవరో క్లోజ్ ఫ్రెండ్ రమ్మన్నాడని వెళ్లి అర్ధరాత్రి తూలుకుంటూ వచ్చేవాడు. మధ్య మధ్య ఎవరిదో బర్త్‌డే పార్టీ అనీ, ఫ్రెండ్‌కి పెళ్లి కుదిరితే పార్టీ ఇచ్చాడని సాకులు చెప్పడం మొదలుపెట్టాడు.

సావిత్రి బెట్టుగానే వుంటోంది. అతను తాగి వచ్చినప్పుడల్లా వంటిమీద చేయి వేయనివ్వడం లేదు. సోఫాలో పడుకుంటోంది. ఎప్పటికైనా చిట్టిబాబు తన దారికి రాకపోతాడా? అని ఆశ పడుతోంది.

కానీ అతగాడు దారికి రావడంలేదు. శరీర సుఖమైనా త్యాగం చేస్తున్నాడుగానీ పార్టీలకి వెళ్లడం, తాగడం మానలేదు.

"అసలు పార్టీల్లో తాగడం ఎందుకండీ?" అని అడిగింది ఒకరోజు.

"అట్లా అడుగు. దీనిని ఇంగ్లీషులో విస్కీ, బ్రాందీ, జిన్ను, రమ్ము అని పిలుస్తారు. తెలుగులో మందు అని అంటారు. ఎందుకంటే మందులా పని చేస్తుంది శరీరానికి. రక్త ప్రసరణ పెంచుతుంది. ఎంత తిన్నా అరిగిపోతుంది. జీర్ణశక్తి దివ్యంగా వుంటుందన్నమాట. పురాణాల్లో కూడా దేవతలు సురాపానం చేసేవారని రాసి వుంది. నువ్వు తెలుగులో కావ్యాలు చదివే వుంటావు. భూసురోత్తమా అని సంభోదిస్తారు. అంటే భూమిమీద సుర తాగే పెద్దమనుషులన్నమాట. అంటే మనం" అని నవ్వాడు చిట్టిబాబు.

"తాగుడికి ఇంత బ్యాగ్రౌండ్ ఉందన్నమాట" అని సావిత్రి ఆశ్చర్యం ప్రకటించింది.

"మరేమనుకున్నావు? మన సంస్కృతిలో తాగడం తప్పులేదు. మారుమూల అడవుల్లో గిరిజనులు స్వచ్ఛమైన విప్పపూవు సారా కాచి తాగుతారు. అందుకే వాళ్లు అంత ఆరోగ్యంగా, దీర్ఘకాలం రోగాలు రొస్టులు లేకుండా జీవిస్తారు."

"అలాగా... మీకు చాలా తెలుసే?"

"జిజ్ఞాస వుంటే, తెలుసుకోవాలనే వుంటే

ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు. ఏ విషయమైనా అసహ్యించుకోదగిందికాదు. పూర్వాపరాలు తెలుసుకోవాలి. తెలుసుకున్నకొద్దీ అద్భుతమైన వాస్తవాలు బయటపడుతుంటాయి. ఇంగ్లీషువాళ్లు మనదేశంలో గిరిజనులు సారాయి కాచే విధానాన్ని చూచి కాపీ కొట్టారు. వాళ్ల దేశం వెళ్లి బ్రాందీ, విస్కీ అంటూ రకరకాలు తయారు చేసి వ్యాపారం మొదలుపెట్టారు. మళ్లీ మనకే స్కాచ్ విస్కీ అనీ, వైన్ అనీ, బీర్ అనీ పేర్లు పెట్టి అమ్ముకోవడం మొదలుపెట్టారు. తెలివి అంటే తెల్లోడిదే'' చెప్పాడు చిట్టిబాబు.

సావిత్రి భర్త మందు పరిజ్ఞానానికి ఆశ్చర్యపోతున్నట్లు ముఖం పెట్టింది.

''ఇంతకీ నేను చెప్పొచ్చేది ఏమిటంటే నేను మందు తాగేది కేవలం ఆరోగ్యం కోసమే. నువ్వు వాసన వాసన అని దూరంగా వుంటున్నావుగానీ దగ్గరగా వుంటే అదే అలవాటైపోయి సువాసనగా తోస్తుందన్నమాట'' అన్నాడు.

''అదే నాకు బాధగా వుందండీ. ఆ వాసన నాకు పడకపోవడం వలన నెలలో సగం రోజులు మీకు దూరంగా ఉండాల్సి వస్తోంది. ఆ వాసనకు ఎలా అలవాటుపడాలో ఆలోచిస్తున్నాను'' అంది సావిత్రి.

''వెరీగుడ్ సావిత్రీ. నన్ను ఇన్నాళ్లికి అర్థం చేసుకున్నావు'' అని భార్యను మెచ్చుకున్నాడు చిట్టిబాబు.

★★★

ఆ రోజు శనివారం.

''ఈరోజు సాయంకాలం తొందరగా ఇంటికి రండి. వీకెండ్ పార్టీ అని లేటుగా రావద్దు'' అంది సావిత్రి.

''ఏమిటి విశేషం?'' అడిగాడు చిట్టిబాబు.

''మన మ్యారేజ్ డే కదా. మర్చిపోయారా?''

''ఓ ఐయామ్ సారీ''

''పెళ్లిరోజును మనం హేపీగా గడుపుదాం.''

''అలాగే...అలాగే..''

''ఈ సంగతి మీ ఆఫీసులో చెప్పకండి. పార్టీ ఇవ్వమని గొడవ చేస్తారు మీ మందు ఫ్రెండ్స్.''

''ఛస్తే చెప్పను. అదీగాక మంత్ ఎండింగ్. డబ్బులు కూడా లేవు'' అన్నాడు చిట్టిబాబు.

సావిత్రి టిఫిన్ బాక్స్ అందించింది.



చిట్టిబాబు బై చెప్పి బయల్దేరాడు.

ఆరు దాటిన తరువాత సావిత్రి సెల్‌కి ఫోన్ చేసింది "బయల్దేరారా లేదా?" అని అడిగింది.

"ఇదిగో సర్దుకుంటున్నా. వచ్చేస్తున్నా" అన్నాడు.


అలా పదినిముషాలకు ఒకసారి ఫోన్ చేస్తూ చిట్టిబాబు ఇంటికి బయల్దేరేవరకూ ఊరుకోలేదు సావిత్రి.

ఏడున్నరకల్లా ఇంటికి చేరుకున్నాడు చిట్టిబాబు.

సావిత్రి తెల్లచీర కట్టుకుని, మల్లెపూలు పెట్టుకుని శోభనం పెళ్లికూతుర్లా కనిపిస్తోంది.


చిట్టిబాబు అమాంతం ఆమెను కౌగిలిలోకి తీసుకున్నాడు.

"అబ్బా...మీకంతా తొందరే. ముందు స్నానం చేసి రండి" అని అతన్ని వదిలించుకుంది.



## జెనీలియా ఆలోచన

జెనీలియా తనకి 50 లక్షలిస్తేనే సినిమా చేస్తానని డిమాండ్ చేస్తున్నట్టు టాలీవుడ్ సినీజనాలు చెప్పుకుంటున్నారు. అయితే అంత భారీ పారితోషికం ఇచ్చేంత క్రేజ్ ప్రస్తుతం ఆమెకి వుందా అని ఆలోచిస్తున్నారు నిర్మాతలు. అదలా వుంటే సినిమాల సంఖ్య తగ్గించుకోడానికే ఇలాంటి డిమాండ్ జెనీలియా చేస్తోందని కొంతమంది అంటుంటే- వచ్చే ఏడాదికల్లా తన రెమ్యూనరేషన్ కోటి రూపాయలు కావాలని తెగ ఆశపడుతోందని ఇంకొంత మంది అంటున్నారు. అది కూడా బాలీవుడ్‌లో బిజీ కావాలనే తలంపుతోనేనట.




చిట్టిబాబు స్నానం చేసి నైట్‌డ్రెస్‌లోకి మారాడు.

"రండి" అంటూ డైనింగ్ టేబుల్ దగ్గరకు ఆహ్వానించింది సావిత్రి.

డైనింగ్ టేబుల్ మీద కొత్త పెళ్లికూతుర్లా నిగనిగలాడిపోతున్న విస్కీ బాటిల్ చూసి చిట్టిబాబు సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయాడు.

"కలా...నిజమా?" అని కళ్లు నులుపుకుని చూసాడు.

నిజమే.

విస్కీ బాటిల్‌లోని ద్రవం బంగారు రంగులో మెరిసిపోతూ రారమ్మని పిలుస్తోంది.

"సావిత్రీ...ఇది?" అన్నాడు.

"మన పనిమనిషి లక్ష్మీతో తెప్పించాను. మంచి బ్రాండేనా?" అని అడిగింది సావిత్రి నవ్వుతూ.

"సూపర్ బ్రాండ్" అన్నాడు తన్మయత్వంగా.

సావిత్రి రెండు ప్లేట్లలో ఉల్లిపాయల పకోడీలు, వేయించిన జీడిపప్పు తెచ్చి టేబుల్‌మీద పెట్టింది. రెండు గ్లాసులు కూడా తెచ్చి తను అతని ఎదురుగా కూర్చుంది.

చిట్టిబాబు అయోమయంగా చూసాడు.

"సావిత్రీ! ఈరెండో గ్లాసు ఎవరికోయ్?" అని అడిగాడు.

"ఎవరికేమిటి? ఇక్కడ ఇంకెవ్వరున్నారు? నాకే" అంది సీరియస్‌గా.

"వ్వాట్? ఏమిటోయ్ విడ్డూరం. నువ్వు విస్కీ తాగుతావా?" ముఖం చిట్లించి అడిగాడు.

"విడ్డూరం ఏముందండీ? మీరేగా చెప్పారు ఇది మందు అనీ, ఆరోగ్య ప్రదాయనీ, రక్తప్రసరణ కంట్రోల్‌లో వుంచుతుందనీ, జీర్ణశక్తి పెరుగుతుందనీ. నేను కూడా తాగుదామని డిసైడ్ చేసుకున్నాను" అంది సావిత్రి.

చిట్టిబాబు పిచ్చివాడిలా చూసాడు.

"మీరేగా చెప్పారు దీని వాసన ఏదోరకంగా అలవాటు చేసుకోమని? నేను కూడా తాగితే ఇక వాసన అనిపించదు కదా? ఎవరి కంపు వారికి ఇంపు అంటారు కదండీ" అంటూ దీర్ఘం తీసింది సావిత్రి.

చిట్టిబాబుకి మతిపోయింది.

"ఈ మందు కోసమని మీరు ఎక్కడెక్కడి బార్లకో వెళ్లి అర్ధరాత్రి వరకూ తిరిగి తిరిగి రావడం ఎందుకు? ఎంచక్కా నేను ఇంట్లోనే కంపెనీ ఇస్తాను కదండీ. ఇక ఇల్లే స్వర్గసీమ" అంది సావిత్రి.

భార్య తనకు షాక్ ట్రీట్‌మెంట్ ఇస్తోందని అర్థమై బావురుమన్నాడు చిట్టిబాబు.

"ఆలస్యం ఏమిటండీ? గ్లాసులో పోయండి. అన్నట్లు సోడా కూడా కలుపుకుంటారట కదా? లక్ష్మి చెప్పిందిలెండి. అందుకే సోడాలు కూడా తెప్పించాను" అని లేవబోయింది సావిత్రి.

చిట్టిబాబుకి బుర్ర తిరిగిపోయింది.

"సారీ సావిత్రీ!" అని ఆమె చేయి పట్టుకున్నాడు.

సావిత్రి కూర్చుండిపోయింది.

"ఇద్దరం ఆడుతూ పాడుతూ తాగుతుంటే హాయిగా వుంటుందికదండీ. ఆదర్శ దంపతులని అందరూ మెచ్చుకుంటారు" అంది నవ్వుతూ.

"ప్లీజ్ సావిత్రీ! గాడ్ ప్రామిస్. ఇక తాగను సరేనా" అని కుర్చీలోంచి లేచాడు.

"అదేంటి? మీకు నా కంపెనీ అక్కర్లేదా?"

"ఎందుకు అక్కర్లేదూ? కావాలి" అంటూ ఆమెను దగ్గరకు తీసుకున్నాడు చిట్టిబాబు.

★